## టెక్స్ టైల్స్ హబ్‌గా ఏపీ



(మొదటి పేజీ తరువాయి)

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీని టెక్స్ టైల్స్ హబ్ గా అభివృద్ధి చేయనున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేయనుందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. 2030 నాటికి 350 బిలియన్ డాలర్ల టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. బ్రాండింగ్ కు మాస్టర్ సీఎం చంద్రబాబు అని, ఆయన నేతృత్వంలో అమరావతి నిర్మాణం తథ్యమని అన్నారు. మోడీ, చంద్రబాబు విజనరీ నాయకులని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రాను నిర్మిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కూటమి ప్రభుత్వం నూతన టెక్స్‌టైల్స్, అపెరల్ పాలసీ తీసుకొస్తే, గత ప్రభుత్వ పాలకులు రప్పా రప్పా పాలసీ అమలు చేశారంటూ వైసీపీని విమర్శించారు. విజయవాడలో ఓ హోటల్ లో రాష్ట్రంలో చేనేత, జౌళి శాఖ, సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులతో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత, హస్త కళల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. చేనేత, హస్త కళాకారులకు 365 రోజుల పాటు ఉపాధి కల్పిస్తూనే, పర్యావరణ పరిరక్షణకు నార ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహిస్తున్నామని తెలిపారు. అరటి, పైనాపిల్, చెరకు నారలతో ఉత్పత్తుల తయారీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏపీని టెక్స్‌టైల్స్ హబ్ గా అభివృద్ధి చేయాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యానికి కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. 2030 నాటికి దేశం నుంచి 350 బిలియన్ డాలర్ల టెక్స్ టైల్స్ ఉత్పత్తుల ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

**బ్రాండింగ్ మాస్టర్ సీఎం చంద్రబాబు :** సీఎం చంద్రబాబు అంటేనే గుర్తుకొచ్చేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. దేశాభివృద్ధిలో చంద్రబాబు పాత్ర ప్రశంసనీయమన్నారు. ప్రధాని నరేంద్రమోడి, సీఎం చంద్రబాబు విజనరీ నాయకులున్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఏపీ అమరావతి రాజధాని నిర్మాణం తథ్యమన్నారు. ఏపీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందన్నారు.

**పెట్రోల్ ధరలు మనదేశంలోనే స్వల్పం పెరుగుదల :** పశ్చిమాసియా, రష్యా – ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఇంధన ధరలు అమాంతంగా పెరిగాయని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో కంటే ఇండియాలోనే పెట్రోల్, డీజిల్ ధరలు స్వల్పంగా పెరిగాయన్నారు. భారత్ లో లీటర్ పై రూ. 10లు పెరిగితే, అమెరికాలో 44 శాతం మేర ధరలు పెరిగాయన్నారు. ఫ్రాన్స్, చైనాలోనూ ఇంధన ధరలు భారీ ఎత్తున పెరిగాయన్నారు. భారత్ లో యువత అధికంగా ఉందని, యువ భారత్ అండతో త్వరలోనే విశ్వ గురుగా ఆవిర్భవించనున్నామని కేంద్రమంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

**కేంద్రం సహకారంతో నార ఉత్పత్తులకు ప్రోత్సాహం : మంత్రి సవిత**

డబుల్ ఇంజన్ సర్కార్ తో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఏపీలో చేనేత, హస్త కళల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. అరటి, చెరకు, పైనాపిల్ నారలతో ఉత్పత్తుల తయారీకి ప్రోత్సాహం అందివ్వడానికి కేంద్ర జౌళి శాఖ ముందుకొచ్చిందన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దే లక్ష్యలో భాగంగా నారా ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యమిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రాను నిర్మిస్తామని మంత్రి సవిత తెలిపారు. గత ప్రభుత్వం రప్పా రప్పా పాలసీని తీసుకొస్తే, తమ ప్రభుత్వం చేనేత, హస్తకళల అభివృద్ధికి టెక్స్‌టైల్స్, అపెరల్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. అనంతరం కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ను, మంత్రి సవితను చేనేత, జౌళి శాఖ, సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు ఘనంగా సత్కరించారు. అంతకుముందు హోటల్ లో ఏర్పాటు చేసిన చేనేత, హస్త కళల స్టాళ్లను మంత్రి సవితతో కలిసి కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పరిశీలించారు. చేనేత, హస్త కళారూపాల తయారీ, వాటి ప్రాచుర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ గౌరవ సలహాదారు సుచిత్ర ఎల్లా, ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్వదేశీ టెక్నాలజీతో 'డెక్స్‌పాడ్స్'



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న బాట్‌ఫోర్జ్ రోబోటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ క్రీడాకారుల కోసం అభివృద్ధి చేసిన లిడెక్స్‌పాడ్స్‌లి పరికరాన్ని రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సచివాలయంలోనీ తన చాంబర్లో ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సంస్థ చీఫ్ సేల్స్ ఆఫీసర్ శీలం శ్రీహర్ష మాట్లాడుతూ, రియాక్షన్ ట్రాకింగ్, స్పోర్ట్స్ పనితీరు అంచనా, శాస్త్రీయ శిక్షణ విధానాలు, ప్రతిభ గుర్తింపు క్రీడాకారుల సమగ్ర అభివృద్ధిలో డెక్స్‌పాడ్స్ వంటి ఆధునిక సాంకేతిక పరికరాలు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. మేక్ ఇన్ ఇండియా లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ సాంకేతికతతో ఈ పరికరాన్ని రూపొందించినట్లు, దేశంలోనే ఈ తరహా వినూత్న క్రీడా సాంకేతిక పరికరాల్లో ఇది ప్రత్యేకమైనదని మంత్రి గారికి తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అకాడమీలు, విద్యాసంస్థలు, శిక్షణ కేంద్రాలకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రతినిధులు పేర్కొన్నారు.

క్రీడా అభివృద్ధికి దోహదపడే వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను ప్రభుత్వం ప్రోత్సహించే దిశగా సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీఈఓ రాజేష్, సిటివో చైతన్య, సిఓఓ సెల్వేందర్ పాల్గొన్నారు.

## 30 రోజుల ఎల్‌పీజీ నిల్వలు.. ఓఎంసీలకు కేంద్రం ఆదేశాలు

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి నుంచి గ్యాస్ సరఫరా దెబ్బతినడంతో వినియోగదారులకు సరఫరాను కూడా తగ్గించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంది. రీఫిల్ బుకింగ్‌ల మధ్య కనీస కాలవ్యవధిని పెంచింది. ఇదే సమయంలో రిఫైనరీలను కూడా అప్రమత్తం చేసింది. గరిష్ఠస్థాయిలో ఎల్పీజీ ఉత్పత్తికి ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ఎల్పీజీ డిమాండ్ సుమారు 72,000 టన్నులు కాగా, దేశీయ రిఫైనరీలు రోజుకు 50,000 నుంచి 52,000 టన్నుల మేర ఎల్పీజీ ఉత్పత్తి చేస్తున్నాయి. ఇది 70 శాతం అవసరాలు తీరుస్తోంది.


# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు. ఇక విద్యుత్ మౌళిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు. ఈ ప్రాజెక్టును మొదలు పెట్టడంతోపాటు... టైమ్ బౌండ్ కార్యక్రమంగా పెట్టుకుని పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

**పీఎం సూర్య ఘర్ అమలులో వేగం పెరగాలి :** సమీక్షలో భాగంగా పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలుపై సీఎం అధికారులతో చర్చించారు. అలాగే ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ పనులు ఎంత వరకు వచ్చాయని అధికారులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 200 మెగా వాట్ల సామర్థ్యంతో ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియను మొదలు పెట్టినట్టు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ భవనాల సోలారైజేషన్ ప్రక్రియలో భాగంగా రెస్కో మోడల్ అనుసరిస్తున్నామని అధికారులు తెలిపారు. నెట్ మీటరింగ్ విధానంలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. అలాగే నెట్ జీరో విధానంలో హెల్తీ క్యాంపస్ లను తీర్చిదిద్దేలా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసేందుకు 2,898 హాస్టళు ,, స్కూళ్లల్లో గుర్తించినట్టు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, స్కూళ్లలో సోలార్ వినియోగం పెరిగితే.. ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందని సీఎం చెప్పారు. ఈ విషయంలో అధికారులు పూర్తిగా ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం అమల్లో ఏపీ నాలుగో స్థానంలో ఉందని... అగ్రస్థానంలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని.. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇక బీసీ వర్గాలకు రూ. 20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లను బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని... వీటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం సూచించారు. ఇక రాష్ట్రంలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ సహకారంతో, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్న విధానాన్ని అధికారులు ప్రజెంట్ చేశారు. ఈ తరహాలో విద్యుత్ సరఫరా కోసం దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ ట్విన్ గ్రిడ్ రూపొందిస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో భాగంగా విద్యుత్ డిమాండ్ ఏ మేరకు ఉందనే విషయాన్ని అధికారులు సీఎంకు వివరించారు. జూన్ 2026 నుంచి నవంబర్ 2026 వరకు రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరి, రోజువారీ డిమాండ్ 226 నుంచి 261 మెగా యూనిట్లు వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని చెప్పారు. మే 27 వరకు 7,060 మెగాయూనిట్ల విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు వెల్లడించారు. 2025తో పోలిస్తే ఏప్రిల్–మే 2026 కాలంలో గరిష్ట డిమాండ్ 14.48 శాతం నుంచి 16.77 శాతానికి విద్యుత్ వినియోగం పెరిగిందని అధికారులు చెప్పారు. రైతులకు ఆర్థికంగా లబ్ధికలిగే సీబీజీ(కంప్రెస్డ్ బయో గ్యాస్)ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహించేలా పాలసీ చేశామని, సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు విషయంలో అధికారులు చొరవ తీసుకుని త్వరితగతిత ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**సీఎంను కలిసిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం :** వరల్డ్ ఎకనమిక్ ఫోరం ప్రతినిధుల బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రీయల్ రెవెల్యూషన్– C4IR అమలు చేయాల్సిన కార్యాచరణపై ఈ బృందం చర్చించింది. C4IR ఏర్పాటుపై ఏపీ ట్రాన్స్ కో–వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో గతంలోనే ఒప్పందం కుదిరింది. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి రంగాలపై C4IR అధ్యయనం చేయనుంది. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. వివిధ రకాల విద్యుత్ ఉత్పత్తి మోడళ్లను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి బెస్ట్ మోడల్ తయారు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని C4IR కార్యాచరణతో అనుసంధానం చేయాలని సూచించారు. రిజల్ట్ ఓరియేంటేషనుతో C4IR పని చేయాలని సీఎం ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రదర్శించే స్థాయికి తీసుకెళ్లాలని C4IRకు సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సీఎస్ సాయిప్రసాద్, విద్యుత్, ట్రాన్స్ కో, జెన్కో, డిస్కంలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు 'టైమ్ బౌండ్'

- ఆర్టీసీ ఆస్తుల సద్వినియోగంతో సంస్థ బలోపేతానికి ప్రణాళికలు
- ఐ అండ్ ఐ, ఆర్టీసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పోర్టులు, ఎయిర్ పోర్టుల నిర్మాణాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇన్ఫ్రా ప్రాజెక్టుల పూర్తికి కాలపరిమితిని నిర్దేశించుకుని పని చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పెట్టుబడులు, మౌళిక సదుపాయల కల్పన, ఆర్టీసీపై ముఖ్యమంత్రి సమీక్షించారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం పురోగతిపై సమావేశంలో చర్చించారు. మూలపేట, రామాయపట్నం, మచిలీపట్నం పోర్టుల నిర్మాణాలపై సీఎం సమీక్షించారు. అలాగే జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దగదర్తి, కుప్పం, శ్రీకాకుళం ఎయిర్ పోర్టుల నిర్మాణం, భూ సేకరణ, నిధుల సమీకరణ, కేంద్రం నుంచి అనుమతులు వంటి అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈవీ బస్సుల కొనుగోళ్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి ప్రారంభోత్సవాల తేదీని ప్రకటించేశాం. రాష్ట్రంలో పెట్టే పెద్దపెద్ద పరిశ్రమలను కూడా 18 నెలల్లో గ్రౌండ్ చేసి ఉత్పత్తి మొదలు పెట్టాలని చెబుతున్నాం. ఇదే తరహాలో ఇన్ఫ్రా ప్రాజెక్టులనూ పూర్తి చేయాలి. ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. అనుమతులు, సాంకేతిక అంశాలు, టెండర్ ప్రక్రియ, నిర్మాణాలన్నింటికీ టైమ్ బౌండ్ పెట్టుకని పని చేయాలి. దశాబ్దాల తరబడి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా... జాప్యం చేస్తూ ఉండడం సరైన విధానం కాదు. ఇక ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణపైనా ప్రధానంగా ఫోకస్ పెట్టాలి.

ఆర్టీసీ ఆస్తులను సద్వినియోగం చేసుకుని.. ఆ సంస్థను మరింత బలోపేతం చేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, సీఎస్ సాయి ప్రసాద్, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆసుపత్రులలో ఫైర్ ఆడిట్ జరగాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు సంభవించకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాల వివారణ కోసం ఫైర్ ఆడిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన పరికరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు గడువు ముగిసిన వాటి స్థానంలో నూతన పరికరాలు కొనుగోలు చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఫైర్ ఆడిట్ తో పాటు ఆసుపత్రిలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి నెల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో మాక్ డ్రిల్ నిర్వహించాలని సూచించినట్లు చెప్పారు. ఫైర్ ఆడిట్ లో కనుగొన్న లోపాలను సంబంధిత ఆసుపత్రులు తక్షణం పునరుద్ధరణ చేయాలని పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల ఎక్స్పైరీ డేట్ ను కూడా విధిగా పరిశీలించాలని అన్నారు.

వేసవి తీవ్రత ఉందని ఈ సమయంలో విద్యుత్తు ఉపకరణాలు వినియోగం అధికంగా ఉంటుందని విద్యుత్ లోడుకు తగిన విధంగా లేనట్లయితే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని పేర్కొంటూ అటువంటి లోపాలు కనుగొనుటకు విద్యుత్ ఆడిట్ ను నిర్వహించాలని ఆదేశించినట్లు తెలిపారు. అగ్నిమాపక పరికరాల వినియోగం, నిర్వహణ అమలును పర్యవేక్షణ చేయడం జరుగుతుందని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి, జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జిజిహెచ్ సూపరింటెండెంట్ ఎస్.ఎస్.వి రమణ, ఎన్.టి.ఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి విజయ్ శేఖర్, ఏ.పి.హెచ్.ఎమ్.ఐ.డి.సి అధికారులు పాల్గొన్నారు.


## గాదె వెంకట్ రెడ్డి మృతి రాజకీయాలకు తీరని లోటు



**బాపట్ల (జర్నలిస్ట్ ఫైల్ ):** న్యాయవాదిగా,బాపట్ల నియోజకవర్గం శాసనసభ్యులుగా, రాష్ట్ర మంత్రి గా పనిచేసే బాపట్ల ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి మృతి చెందడం రాజకీయాలకు తీరని లోటని ఉమ్మడి గుంటూరు జిల్లా మాజీ ఎమ్మెల్సీ, భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. నైతిక విలువలతో రాజకీయాలు చేసి బాపట్లలో ఎంతగానో అభివృద్ధి చేశారని తెలిపారు. గాదె వెంకట రెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.అయన కుటంబ సభ్యులకు సానుభూతి తెలియజేసారు.

# సైబర్ నేరాల అడ్డుకట్టకు "ఏపీ సైబర్ గార్డ్"

- 6 పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో నేరాలకు అడ్డుకట్ట
- ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి...సైబర్ పెట్రోలింగ్ జరగాలి
- సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్
- ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌కు కలగాలి
- ప్రజలు నష్టపోకుండా బ్యాంకులు సహకరించాలి
- సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యాచరణపై సమీక్షలో సీఎం చంద్రబాబు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో సైబర్ నేరాల అడ్డుకట్టకు జీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బాధితులు సైబర్ వార్ రూమ్‌కు ఫోన్ చేసిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బ్యాంకులను అప్రమత్తం చేసి గోల్డెన్ అవర్ టైంను వినియోగించుకుని అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ కాకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు బ్యాంకులూ సహరించాలన్నారు. సైబర్ నేరాలపై అన్ని వర్గాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని, అవగాహనా కార్యక్రమాలు పెంచాలని సీఎం సూచించారు. పోలీస్ పెట్రోలింగ్ తరహాలోనే సైబర్ పెట్రోలింగ్ జరగాలని, ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడాలని సీఎం సూచించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు రావడం, పోలీసులు విచారణ జరపడం కంటే...అసలు నేరమే జరిగే అవకాశం లేకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్ గా చేసుకుని జరుగుతున్న నేరాల పట్ల వారికి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. 6 పిల్లర్ రెస్పాన్స్ టీమ్స్‌తో వివిధ రకాల సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తాము సిద్ధం చేస్తున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

**28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు... 4 రీజనల్ హబ్‌లు : డీజీపీ** ప్రజెంటేషన్‌పై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..."సైబర్ నేరాలను అరికట్టేందుకు సిక్స్ పిల్లర్ వ్యవస్థలతో ఏపీ సైబర్ గార్డ్ అనే సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. 6 పిల్లర్ సైబర్ భద్రతా వ్యవస్థలో సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్ బోర్డ్, టెక్నాలజీఏఐ, కెపాసిటీ బిల్డింగ్, 3–టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడతాం. 6 పిల్లర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఒక సైబర్ వార్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్'లో ఇప్పటికే భవనాన్ని ఎంపిక చేశాం. ఈ సైబర్ వార్ రూంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, సైబర్ థ్రెట్ ఇంటలిజెన్స్ అండ్ ఎనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్, సైబర్ ట్రైనింగ్ అండ్ అవేర్నెస్ రీసెర్చ్, లీగల్, పాలసీ అండ్ కంప్లైంట్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ వంటి మొత్తం 11 విభాగాలు పనిచేస్తాయి. రానున్న 30 రోజుల్లో ఆధునిక సదుపాయాలతో ఈ వార్ రూం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 1930 హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేస్తాం. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ (చీజ౯ూ), 1930 హెల్ప్‌లైన్‌తో సమగ్ర డ్యాష్‌బోర్డ్ తీసుకువస్తున్నాం. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో బ్యాంకును సంప్రదించి నిందితుని అకౌంట్లో డబ్బులు ఫ్రీజ్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. సైబర్ నేరాలపై టెక్నాలజీ ఉ ఏఐ ఉపయోగించుకునేందుకు ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి వీబశ్రీవఎబత్వతీ.ూ× అమలు దిశగా చర్యలు తీసుకువస్తున్నాం. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా ఏడాది కాలంలో 500 మంది పోలీసు అధికారులకు సైబర్ క్రైంపై ట్రైనింగ్ ఇస్తాం. 3 టైర్ ఆర్కిటెక్చర్ ద్వారా 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లతో పాటు 4 చోట్ల రీజనల్ హబ్‌లను ఏర్పాటు చేస్తాం. వీటితో పాటు ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఏడాదిలో 3 వేల కార్యక్రమాలు వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో చేపడతాం. ఏపీ సీఐడీ, ఏపీటీఎస్ బృందం న్యూఢిల్లీలోని ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వ్యవస్థలను అధ్యయనం చేసింది. అక్కడ అవలంభిస్తున్న పాలసీల ఆధారంగా రాష్ట్ర జఎఎవతీ ఖీబంఱశీఱ జవత్తీవ రూపకల్పన చేపడుతున్నాం. టాప్ బ్యాంక్‌ల నోడల్ అధికారుల నియామకం, 30 నిమిషాల ఎస్ఎల్ఏ కోసం బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటాం. సీసీఎస్ పోలీస్ స్టేషన్లను ప్రత్యేక దర్యాప్తు యూనిట్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాము. ఈ విధంగా అన్ని చర్యలను తీసుకుని సైబర్ మోసాలకు, నేరాలకు అడ్డుకట్ట వేస్తాం" అని ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

**డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి : సీఎం**

అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...."రాష్ట్రాన్ని సైబర్ నేరాల రహిత రాష్ట్రంగా మార్చాలి. దీని కోసం అన్ని బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేరస్తులు కొత్తకొత్త పద్ధతుల్లో నేరాలకు పాల్పడుతున్నందున దానికి అనుగుణంగా పోలీసుల కౌంటర్ ప్లాన్ ఉండాలి. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు విషయంలో విద్యావంతులు సైతం మోసపోతున్నారని... డిజిటల్ అరెస్టు లేదనే విషయాన్ని ప్రజల్లో నాటుకుపోయేలా చేయాలి. డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టై తీరాలి. ఆ తరహాలో కఠిన చర్యలు ఉండాలి. ఏళ్ల తరబడి కష్టపడి ప్రజలు దాచుకున్న సొమ్ములను సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో దోచుకుంటున్నారు. దీని వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తోంది. ఏపీ సైబర్ నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి. సైబర్ నేరగాళ్ల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ఏపీ ప్రజలను మోసం చేస్తే....తప్పించుకోలేం అనే హెచ్చరిక క్రిమినల్స్‌కు చేరాలి. ఆ స్థాయిలో భయం కల్పించేలా పోలీసు దర్యాప్తు, యాక్షన్ ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో జరిగిన సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, స్పెషల్ సెక్రటరీ విజయ్ కుమార్ పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధరల స్థిరీకరణపై కూటమి కసరత్తు



(మొదటి పేజీ తరువాయి)

ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఖరీఫ్-2026 సీజన్‌కు ముందస్తు సన్నద్ధత :** రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ, పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, మనోహర్ తెలిపారు. రైతులు ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలను సాగు చేసేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్ తక్కువ ఉన్న వరి రకాల సాగు వల్ల ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1010, పీఆర్-126 వంటి రకాలలో అధిక శాతం నూక వస్తుండటంతో వినియోగానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా యంత్రాంగానికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ధరలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చామని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నా బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ ఎస్. డిల్లీ రావు, ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు

(మొదటి పేజీ తరువాయి)

వీబీ జీ రాం జీ, స్వచ్ఛాంధ్ర, కాలుష్య నియంత్రణ మండలి నిధులను కూడా వినియోగించుకోవాలని తెలిపారు.

**గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణం :** గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల పరిధిలో పుష్కరాల నిర్వహణ నిమిత్తం 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శుల సమన్వయ సమావేశం నిర్వహించి 262 పంచాయతీలను పుష్కరాల నాటికి మురుగు విడుదల రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ప్రతి రోజూ గోదావరిలో గ్రామీణ ప్రాంతాల మురుగు 8.38 మిలియన్ లీటర్లు కలుస్తున్నట్లు గుర్తించారు. ఈ మురుగు నిర్వహణకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

గృహ వినియోగ మురుగు నీటి నియంత్రణ, నిర్వహణ కోసం వీబీ జీ రాం జీ పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. బ్లాక్ వాటర్ నిర్వహణ కోసం సామాజిక ఇంకుడు గుంతల తరహా నిర్మాణాలు, ఇండివిడ్యువల్ హౌస్ హోల్డ్ ట్విన్ పిట్స్ చేపట్టాలని తెలిపారు. కాలువలు, డ్రెయిన్ల ద్వారా మురుగు నేరుగా గోదావరి నదిలోకి విడుదల కాకుండా పంచాయతీ సిబ్బందితో నిరంతర పర్యవేక్షణా బృందాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

**ప్రమాదకర స్థితికి గోదావరి పరివాహక కాలుష్యం :** మున్సిపాలిటీలు, పారిశ్రామిక, గ్రామీణ ప్రాంతాలతో పాటు గోదావరి నదిలో కలుపుతున్న ఆక్వా కాలుష్యం ప్రమాదకర స్థితికి చేరినట్టు పీసీబీ అధికారుల పరిశీలనలో తేలింది. ఆరు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల నుంచి సుమారు రోజుకి 104 మిలియన్ లీటర్ల మురుగునీరు జీవనదిని కలుషితం చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి రోజు మరో 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు కూడా పెద్ద ఎత్తున నదిలో కలిపేస్తున్నారు. అందులో ఒక్క ఆంధ్రపేపర్ మిల్స్ నుంచే రోజుకి 32 మిలియన్ లీటర్ల వరకు వ్యర్థాలు విడుదల అవుతున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిత్యం విడుదల అవుతున్న 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనం. ప్రజారోగ్యం, భద్రత దృష్ట్యా గోదావరి జలాలను కలుషితం చేస్తున్న మురుగు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల రూపంలో వెదజల్లే కాలుష్య నివారణకు అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు.

గోదావరి తీర ప్రాంత పట్టణాల నుంచి విడుదల అయ్యే మురుగు నీటిని శుద్ధి చేయకుండా నేరుగా గోదావరి నదిలో కలిపేస్తున్నట్టు గుర్తించారు. ప్రధాన పట్టణాలు అయిన రాజమహేంద్రవరం కార్పోరేషన్, కొవ్వూరు, నరసాపురం, తణుకు మున్సిపాలిటీలు నుంచి పెద్ద ఎత్తున మురుగు నీరు గోదావరిలోకి విడుదల అవుతోంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం కార్పోరేషన్ నుంచి రోజుకి 75 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తి అవుతుండగా అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా గోదావరి నదిలోకి విడుదల చేస్తున్నారు. తణుకు మున్సిపాలిటీల నుంచి రోజుకి సుమారు 11.1 మిలియన్ లీటర్లు, భీమవరం నుంచి 14 మిలియన్ లీటర్లు, నరసాపురం నుంచి 8.5 మిలియన్ లీటర్లు, కొవ్వూరు నుంచి 6 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు యనమదుర్రు, గోస్తనీ తదితర డ్రెయిన్ల ద్వారా గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ఇతర మున్సిపాలిటీల నుంచి కూడా గోదావరి నదిలోకి నిత్యం మురుగునీటి విడుదల కొనసాగుతోంది. పట్టణ ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరం మాత్రమే గోదావరిలోకి విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ఇందుకోసం ప్రతి మున్సిపాలిటీ పరిధిలో సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే గోదావరి కాలుష్య నియంత్రణ నిమిత్తం కాలుష్య నియంత్రణ మండలి ద్వారా మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులతోపాటు అవసరం అయితే స్వచ్ఛాంధ్ర నిధులు కూడా వినియోగించుకుంటూ దశలవారీ ప్రణాళికలు అమలు చేయాలని తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై దశలవారీ నిషేధాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని గోదావరి పరివాహక మున్సిపాలిటీలన్నింటిలో ఆదేశాలు జారీ చేశారు. పర్యావరణహిత ప్రత్యామ్నాయాల వినియోగంపై దృష్టి సారించాలని సూచించారు.



గోదావరిలో కలుపుతున్న పారిశ్రామిక కాలుష్య నివారణకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. వాయు కాలుష్య నివారణకు పారిశ్రామిక వర్గాలు తగినంత పచ్చదనాన్ని పెంపొందించే ఏర్పాటు చేయాలి. మురుగు శుద్ధి, ద్రవరూప కాలుష్య నియంత్రణ కోసం అన్ని పరిశ్రమలు ఆధునిక సాంకేతికతతో కూడిన వ్యవస్థలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశం చేశారు.

స్వచ్ఛమైన గోదావరి జలాల్లో భక్తులంతా పవిత్రమైన పుష్కరాలు జరుపుకునేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని తెలిపారు. పుష్కరాలకు ముందుగానే అన్ని విధాల చర్యలు తీసుకోవాలని, గ్రామీణ వ్యర్థాల తొలగింపు పర్యవేక్షణకు ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ఏర్పాటు చేసి వ్యర్థాల శుద్ధి, విడుదలపై నిరంతర సమాచారాన్ని తెలుసుకునే విధంగా ప్రత్యక్ష పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కంట్రోల్ రూంలో ప్రాంతాలవారీగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, వాటిని సీసీ కెమెరాలతో అనుసంధానించాలని తెలిపారు. ఎక్కడెక్కడ మురుగు శుద్ధి చేస్తున్నారు, ఎక్కడైనా నేరుగా గోదావరి నదిలోకి మురుగుని వదులుతున్నారా తెలుసుకుని, ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చే వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల మురుగు నీటి నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రధాన నదుల కాలుష్య నివారణకు ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ టాస్క్‌ఫోర్స్‌కు కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నట్టు తెలిపారు.

# ఏపీకి 750 'ఈ-బస్సులు'

(మొదటి పేజీ తరువాయి)

ట్రాన్స్‌కో అధికారులు మౌలిక వసతుల ఏర్పాటుపై వివరాలు సమర్పించారు. అన్ని ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసి 2026 ఏడాది చివరికల్లా ఈ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.

ఈ బస్సుల కోసం గుంటూరులో సివిల్ వర్కులకు రూ.16.3 కోట్లు, ఎలక్ట్రికల్ పనులకు రూ.11.19 కోట్లు కలిపి మొత్తం రూ.27.49 కోట్లు మంజూరు కానున్నాయి. మంగళగిరిలో సివిల్ వర్కులకు రూ.9.24 కోట్లు, ఎలక్ట్రికల్ పనులకు రూ.7.01 కోట్లు కలిపి మొత్తం రూ.16.25 కోట్లు కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు నగరాలకు తలో 100 బస్సులు, కర్నూలు, కాకినాడ, రాజమహేంద్రవరం, కడప, అమరావతి, తిరుపతి, అనంతపురం నగరాలకు తలో 50 బస్సులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రజా రవాణా రంగంలో ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరిన్ని గ్రీన్ మొబిలిటీ ప్రాజెక్టులకు ఇది మార్గదర్శకంగా మారుతుందని సమావేశంలో అభిప్రాయపడ్డారు.

ఈ సమావేశంలో ఏపీ సీపీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.వి. రవివర్మ, చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, గుంటూరు ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ రమేష్, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఈ సి. హెచ్.ఎన్. వెంకట్రావు, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ (సీఆర్‌డీఏ) ఎం. శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పురస్కారం!



(మొదటి పేజీ తరువాయి)

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.

స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో సాంఘిక సంక్షేమ హాస్టల్స్, గురుకుల విద్యాలయాలు, వసతి గృహాల విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బందికి 2025-26 సంవత్సరానికి ఎస్ఎస్ సీ, ఇంటర్మీడియట్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు సన్మాన కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

చదువే జీవితాన్ని మార్చగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్న మంత్రి, అభివృద్ధికి కులాలు అడ్డంకి కావని, విద్య ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాస్టళ్లలో సానిటేషన్, నాణ్యమైన ఆహారం, వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ప్రవేశపెట్టిన '100 డేస్ యాక్షన్ ప్లాన్' ఫలితంగా గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల ఆడపిల్లలకు సురక్షిత వాతావరణంలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన 165 మంది రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులను, 132 మంది హాస్టల్ విద్యార్థులను ప్రభుత్వం ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, 3.53 లక్షల మంది ఎస్సీ విద్యార్థులకు రూ. 917 కోట్లు, 2.51 లక్షల మంది ప్రీ-మెట్రిక్ విద్యార్థులకు రూ.320 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. హాస్టళ్ల మరమ్మతులు, అదనపు మరుగుదొడ్లు, కొత్త భవనాల నిర్మాణానికి వందల కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థుల భద్రత కోసం హాస్టళ్లలో సీసీ కెమెరాలు, శానిటేషన్ కోసం ప్రత్యేక అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఆరోగ్య పరిరక్షణ కోసం ఆధునిక సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. హెడ్ ఆఫీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఐఐటీ, నీట్ కోచింగ్ కేంద్రాల సంఖ్యను 10 కు పెంచి, కొత్తగా ఎక్సలెన్స్ సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది 187 మంది విద్యార్థులు వివిధ జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించారని పేర్కొన్నారు. గీతం ఇన్‌స్టిట్యూట్స్ సహకారంతో 600 మంది సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ విద్యార్థులకు ఉన్నత విద్య, వసతి, ఫీజులను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి తెలియజేశారు.

సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి కి విద్యార్థులు, విద్యా సంబంధ కార్యక్రమాలు అంటే చాలా మక్కువని అందుకే తరచూ విద్యార్థులకు కల్పించే సౌకర్యాలపై సమీక్ష చేస్తారన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను అందిపుచ్చుకుని తమ జీవితాలను అత్యుత్తంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ లో సాధించిన మార్కులు జీవితాంతం గుర్తుంటాయని వీటి ఆధారంగా తమ కెరీర్ ను మలచుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా ఆడబిడ్డలను విద్యాపరంగా ప్రోత్సాహించాలన్నారు.

రాష్ట్ర స్థాయిలో మొదటి, రెండు, మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో పాటు వరుసగా రూ. 20,000, రూ. 15,000, రూ. 10,000 నగదు బహుమతులు అందజేశారు. అలాగే జిల్లా స్థాయి టాపర్లను కూడా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. అత్యుత్తమ ఫలితాల సాధనలో విశేష కృషి చేసిన అధికారులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి టాపర్లు, అధికారులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు తదితరులు కలిపి మొత్తం 297 మందికి అవార్డులు ప్రదానం చేశారు.

కార్యక్రమంలో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్. వి, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల ఫార్మసీ కళాశాల పరీక్షా ఫలితాల విడుదల

**మంగళగిరి :** మంగళగిరి సమీపంలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (ఆటోనమస్)లో నిర్వహించిన I/IV బి.ఫార్మసీ మరియు II/IV బి.ఫార్మసీ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల (ఏప్రిల్--2026) ఫలితాలను గురువారం కళాశాల యాజమాన్యం విడుదల చేసింది. విద్యార్థులు తమ రిజిస్ట్రేషన్ నంబర్ ద్వారా కళాశాల అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను పరిశీలించవచ్చని తెలిపారు.

పరీక్షా ఫలితాలను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, చీఫ్ సూపరింటెండెంట్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. బి. పాముల రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.కె.ఎం. సుభాని విడుదల చేశారు.

ప్రథమ సంవత్సరం ప్రథమ సెమిస్టర్ బి.ఫార్మసీ విద్యార్థులు 72.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెక్షన్--ఎలో మొహమ్మద్ అఫ్రా తబస్సుమ్ 9.10 ఎస్‌జీపీఏతో తొలి స్థానం సాధించగా, మొహమ్మద్ సల్మాన్ 8.69, గంగనపల్లి మేరీ మానస 8.55 ఎస్‌జీపీఏలతో తదుపరి స్థానాల్లో నిలిచారు. సెక్షన్--బీలో యేపూరి శ్రీ హర్షిణి 8.90 ఎస్‌జీపీఏతో ప్రథమ స్థానంలో నిలవగా, వల్లభాపురపు వినయ్ కాంత్ 8.86, ముట్టె వెంకట సాయి శ్రీ 8.80 ఎస్‌జీపీఏలతో మెరిశారు.

అలాగే ద్వితీయ సంవత్సరం తృతీయ సెమిస్టర్ బి.ఫార్మసీ విద్యార్థులు 73.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ విభాగంలో ఎ. గాయత్రి దేవి 9.17 ఎస్‌జీపీఏతో టాపర్‌గా నిలవగా, ఎస్.కె. హమీదా 8.92, పి. మౌనిక మరియు కె. అఖిల 8.67 ఎస్‌జీపీఏలతో ప్రతిభ కనబర్చారు.

ఈ సందర్భంగా రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపక బృందం కృషి, అంకితభావం వల్లే ఈ విజయవంతమైన ఫలితాలు సాధ్యమయ్యాయని అభినందించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి మాట్లాడుతూ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు జూన్ 8 నుంచి జూన్ 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

రీవాల్యుయేషన్‌కు సంబంధించిన వివరాల కోసం పరీక్షల విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డా. నరేష్ బాబు రేఖా, బి.ఫార్మసీ కోఆర్డినేటర్ ఎస్. స్వాతి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# "మ్యాంగో మేళా - 2026"లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి



- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విశాఖపట్నం, (జర్నలిస్ట్ ఫైల్) :** గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో విశాఖ జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయంలో ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న "మ్యాంగో మేళా - 2026"లో ప్రజలందరూ పాల్గొని సహజసిద్ధంగా పండిన మామిడి పండ్లను కొనుగోలు చేసి వినియోగించుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయనాల వినియోగం లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన మామిడి పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. సహజంగా పండిన పండ్లను తీసుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మరింతగా ఆకర్షితులు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించే లక్ష్యంతో ఈ మ్యాంగో మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతులను ప్రోత్సహించాలని, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

# బీజేపీ జనతా వారధి కార్యక్రమంలో ప్రజా సమస్యల స్వీకరణ




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రజల సమస్యలను స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ అంశాలకు సంబంధించిన వినతిపత్రాలను నాయకులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడ్డూర్ శ్రీరామ్, బీజేపీ స్టేట్ హెడ్ క్వార్టర్స్ ఇంచార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, పిట్టల గోవింద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు పార్టీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అమరావతికి పెరిగిన క్రేజ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో ఇప్పటివరకూ మొత్తం 114 సంస్థలకు భూములు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు..వీటిలో చాలా సంస్థలు తమ నిర్మాణాలను ప్రారంభించాయని చెప్పారు..రాజధానిలో భూముల కేటాయింపునకు సంబంధించిన మంత్ర వర్గ ఉపసంఘం ఆన్ లైన్ లో సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు నారాయణ,పయ్యావుల కేశవ్,టీజీ భరత్,కందుల దుర్గేశ్,కొల్లు రవీంద్ర,సంధ్యా రాణి తో పాటు సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు హాజరయ్యారు.సమావేశం ముగిసిన తర్వాత మంత్రి నారాయణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు



అమరావతిలో ఇప్పటివరకూ 114 సంస్థలకు 1269 ఎకరాలు కేటాయించాం.వీటిలో 70 ప్రభుత్వ సంస్థలు,44 ప్రైవేటు సంస్థలు ఉన్నాయి.భూములు కేటాయించిన వాటిలో బ్యాంకులు 16,ఉద్యోగుల ఇళ్ల కోసం 8 బ్యాంకులకు,విద్యాసంస్థలు 22,రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు 13,కేంద్రప్రభుత్వ సంస్థలు 17,వైద్య సంస్థలు 7,హోటల్స్ 14,క్రీడా సంస్థలు 2,ఇతర సంస్థలు 5 ఉన్నాయి.

ఇక నిర్మాణాల దశను చూస్తే 20 సంస్థలు నిర్మాణం కొనసాగుతుండగా,9 సంస్థలు నిర్మాణం పూర్తయ్యాయి.18 సంస్థలు నగదు చెల్లించే దశలో,25 సంస్థలు అగ్రిమెంట్ దశలో,మరో 38 సంస్థలు డిజైన్ల దశలో ఉన్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.

భూములు కేటాయించిన 114 సంస్థల్లో 3 సంస్థలు వేర్వేరు కారణాలతో రద్దు చేసుకున్నాయి.వీటిలో జీఆర్టీ హోటల్స్,స్పెండర్,ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్ సంస్థలున్నాయి.ఐఆర్సీసీటీసీ కొత్తగా ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదని తీసుకున్న పాలసీ నిర్ణయంలో భాగంగా కేటాయింపును రద్దు చేసుకున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు.

ఇక భూముల కేటాయింపు కోసం 16 సంస్థలు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు..ఆయా సంస్థలకు కేటాయింపులపై ఆసక్తి వ్యక్తీకరణలేదా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ ద్వారా ముందుకు వెళ్తామన్నారు.


శుక్రవారం జరిగిన సబ్ కమిటీ సమావేశంలో జీవీ ఎస్టేట్స్ హెటల్స్ కు గతంలో కేటాయించిన స్థలానికి బదులు వేరే ప్రాంతంలో కేటాయించామని,హైదరాబాద్ ఎడ్యుకేషనల్ అకాడమీకి బ్రాండ్ మార్పునకు ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు...ూూ౦=ణ×,ఏపీ పబ్లిక్ లైబ్రరీస్,తెలుగు కల్చరల్ సెంటర్,సబ్సిడరీ ఇంటిలిజెన్స్ బ్యూరో సంస్థలకు గతంలో కేటాయించిన విస్తీర్ణంలో మార్పులు చేయడంతో పాటు స్థలం కూడా మార్పు చేసినట్లు మంత్రి చెప్పారు..

**డీజిల్ ఎఫెక్ట్ రాజధానిపై లేదు.:** ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులతో రాజధాని నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదని మంత్రి నారాయణ స్పష్టం చేసారు..రాజధాని పనుల్లో ఉపయోగిస్తున్న మెషినరీకి డీజిల్ కొరత లేకుండా ఆయా కాంట్రాక్ట్ సంస్థలు చర్యలు తీసుకున్నాయని మంత్రి చెప్పారు.

**అమరావతి నిర్మాణాలకు ఆటంకం లేదు :** దేశంలో భారీ నిర్మాణాలకు కొంత విరామం ఇవ్వాలని మంత్రి నారాయణ అందరికీ సూచించారు..అయితే అమరావతి రాజధాని కాబట్టి కొనసాగిస్తున్నామన్నారు.ఇప్పటికే ఇక్కడ నిర్మాణాల్లో కొన్ని చాలా వరకూ పూర్తి కాగా....మరికొన్ని మధ్యలో ఉన్నాయన్నారు..రాజధాని కోసం 29 వేల మంది రైతులు ఎంతో ఆశతో ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు ఇచ్చారని,గత ఐదేళ్లలో అమరావతి ఆగిపోయిందని,ప్రస్తుతం ఎంతో వేగంతో నిర్మాణం కొనసాగుతుందన్నారు..

**అమరావతిలో భూములు కోసం ముంబై సినీ ప్రముఖులు వినతి :** అమరావతిలో తమకు భూకేటాయింపులు చేయాలని ముంబై నుంచి సంజయ్ దత్ లాంటి వారు కోరారని మంత్రి చెప్పారు..అయితే ఎవరికి భూములు కేటాయించాలన్నా ముందుగా డీపీఆర్ తో పాటు వారి ఆర్థిక పరిస్థితి అనగా బ్యాలెన్స్ షీట్,ఫైనాన్సియల్ షీట్ చూసిన తర్వాత నిర్ణయం తీనుకుంటున్నామన్నారు..ఒకసారి భూకేటాయింపులు చేసిన తర్వాత ఆర్థిక ఇబ్బందులతో నిలిపివేస్తే ఇబ్బందులు వస్తాయని మంత్రి చెప్పారు.

# చెన్నైలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 శిక్షణ వర్గ్



- **హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**చెన్నై(జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 శిక్షణ వర్గ్ శుక్రవారం చెన్నైలో ఘనంగా నిర్వహించారు. ఈ శిక్షణ వర్గ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్ జీ, అఖిల భారతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. పార్టీ భావజాలం, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం, కార్యకర్తల బాధ్యతలు, సమాజ సేవలో రాజకీయాల పాత్ర వంటి అంశాలపై విస్తృతంగా చర్చలు నిర్వహించారు.

దేశాభివృద్ధి, సమాజంలోని చివరి వ్యక్తి సంక్షేమమే భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. కార్యకర్తలు క్రమశిక్షణ, సేవా భావంతో ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

శిక్షణ వర్గ్‌లో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు దేశ నిర్మాణంలో పార్టీ కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

# సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలి: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది.

స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## ఎంపి సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం



**తాండూర్, (జర్నలిస్ట్ ఫైల్) :** బక్రీద్ పండుగను పురస్కరించు కుని తాండూర్ మండల కేంద్రంలోని ఎంపి సంస్థ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండి దావూద్ మాట్లాడుతూ, ప్రతి ఏటా బక్రీద్ రోజున ఎంపి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. పండుగ రోజు పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి సంస్థ సభ్యులు జక్రియ, ఇలియాస్, ఈస, సుబుర్, ఇబ్రహీం, సిద్ధిక్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పదం కాదు మా జీవన విధానం

**-తెలంగాణ వాది, ఉద్యమకారుడు, గాయకుడు ప్రదీప్ కుమార్ మోరపల్లి**



**జగిత్యాల , మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పదం డిక్షనరి లో వెతికే పదం కాదని, అది నాలుగు కోట్ల ప్రజల హృదయ నాదం, అది మా జీవన విధానం అని తెలంగాణ వాది, ఉద్యమకారుడు, గాయకుడు ప్రదీప్ కుమార్ మోరపల్లి అన్నారు. తెలుగుదేశం మహానాడు వేదికగా తెలంగాణా కు చెందిన పూర్వ టీడీపీ అధ్యక్షులు బక్కని నర్సింహులు తన ప్రసంగంలో భాగంగా తెలంగాణా పై నోటికి వచ్చినట్లు మాట్లాడడం తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఆయన చేసిన వ్యాఖ్యలు అహంకార పూరిత ధోరణికి నిదర్శనంగా భావిస్తున్నామన్నారు. పదేళ్ళు గడిచిన పసుపు బ్యాచ్ ఇంకా తెలంగాణ పై విషం కక్కుతున్నారని, దానికీ జై తెలంగాణ నినాదం ఒక్కటే విరుగుడు అన్నారు.. మరోమారు తెలంగాణ సమాజం అంత ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, ఆ ఐక్యత, నినాదమే తెలంగాణా కు శ్రీరామ రక్ష అన్నారు. మన వేలుతో, మన కన్నె పొడిచే విధంగా కుట్రలు చేస్తున్న సీమంధ్ర 'బాబు' ల చిల్లర వేషాలు తెలంగాణా లో సాగవన్నారు. తెలంగాణ అనేది చరిత్రలో, శాసనాల్లో, సాహిత్యంలో ఉన్నదని.. దీనిపై అవగాహన లేని బక్కని నర్సింహులును ఒక అజ్ఞానిగా భావిస్తున్నామన్నారు. చంద్రబాబు మెప్పు కోసం, మా తెలంగాణ ను చులకన చేసి మాట్లాడడాన్నీ భవిష్యత్ క్షమించదన్నారు. కన్న తల్లీ పాలు తాగి, రొమ్ము గుద్దే ఇలాంటి తొత్తుల వల్లనే తెలంగాణాకు భవిష్యత్ లో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. బక్కని నర్సింహులు వ్యాఖ్యలను రెండు కళ్ల సిద్ధాంత పితామహుడు చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు గానే భావిస్తున్నామని, అయనకు అలాంటి ఆలోచన లేకుంటే భేషరతుగా చంద్రబాబు ఆ వ్యాఖ్యలు ఖండించాలన్నారు. తెలంగాణా పట్ల అనుచిత, అభ్యంతకర వ్యాఖ్యలు చేసిన నర్సింహులు యావత్ తెలంగాణా సమాజానికి క్షమాపణలు చెప్పాలని ప్రదీప్ కుమార్ డిమాండ్ చేశారు

## నందమూరి తారక రామారావు 103 జయంతి సందర్భంగా వృద్ధులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ



**(జర్నలిస్ట్ ఫైల్) :** కడప జిల్లా ఎర్రగుంట్ల విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 103 వ జయంతిని పురస్కరించుకొని యర్రగుంట్ల టౌన్ బాలాజీ నిరాశ్రయుల వసతి గృహము లోని వృద్ధులకు నిరాశ్రయులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేసిన యర్రగుంట్ల ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ! ఈ సందర్భంగా యర్రగుంట్ల తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు: సన్నపు రెడ్డి సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మా అభిమాన నాయకుడైన నందమూరి తారక రామారావు గారిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు !ఈ కార్యక్రమంలో రమేష్ నాయుడు మాట్లాడుతూ.. కథానాయకుడిగా, తెలుగువారి గుండెల్లో, చిరస్థాయిగా నిలిచి, రాజకీయ రణరంగంలో ఒక సునామీ సృష్టించి పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా పేదల కొరకు ఆయన తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను సేవా కార్యక్రమాలను రమేష్ నాయుడు కొనియాడారు! ఈ కార్యక్రమంలో సన్నపురెడ్డి సంజీవరెడ్డి, రమేష్ నాయుడుతో పాటు, తల్లం శివ శంకర్, వారథి మోహన్, నాగ భూషణ్ రెడ్డి, రాముడు, మస్తాన్ మరియు ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రెండో వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం. సర్పంచ్ గోపాల్



**పెగడపల్లి, మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం వెంగలాయిపేట గ్రామ రెండో వార్డులో ఐదు లక్షల వ్యయంతో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని గ్రామ సర్పంచ్ మోకినపల్లి గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ మౌలిక వసతుల కల్పనలో భాగంగా నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, గ్రామ పరిశుభ్రతను మెరుగుపరచడంతో పాటు, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యను తగ్గించడంలో ఎంతోఉపయోగపడుతుందని అన్నారు. గ్రామ ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధి పనులు మరింత వేగంగా కొనసాగిలా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కడారి తిరుపతి, వార్డు సభ్యులు తోట కవిత- లక్ష్మీనారాయణ,సింగిల్ విండో డైరెక్టర్ తోట మల్లేశం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తోట మల్లయ్య, ఐల లింగారెడ్డి, బండారి మహిపాల్, జక్కుల బక్కయ్య, గ్రామ ప్రజలు, మహిళా సంఘ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

## వర్తక సంఘం ఉపాధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవ ఎన్నిక. పెద్ది రమేష్



**పెగడపల్లి, మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం కేంద్రంలో గత పది రోజుల క్రితం వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వర్తక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలలో భాగంగా పెగడపల్లి వర్తక సంఘం ఉపాధ్యక్షుడిగా రెండవసారి పెద్ది రమేష్ ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన వర్తక సంగం కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వర్తక సంఘం సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధి కోసం నా వంతు కృషి చేస్తానని అన్నారు. వర్తక సంఘం ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా పలువురు అభినందించడం జరిగిందని తెలిపారు.

## ధర్మపురిలో ఘనంగా నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు

**-పెద్దపల్లి పార్లమెంటు హడక్ కమిటీ సభ్యులు. డాక్టర్ రామకిష్టయ్య**



**ధర్మపురి, మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో గల నంది చౌరస్తాలో పెద్దపల్లి పార్లమెంటు హడక్ కమిటీ సభ్యులు డాక్టర్ వుప్పుల రామకిష్టయ్య ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు 103 వజయంతి వేడుకలను గురువారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. టి రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా పేదలకు అరటి పండ్లను పంపిణీ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడారపు రాజశేఖర్, అయ్యోరు శంకరయ్య,జిల్లపల్లి భీమయ్య,కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ప్రతి సంవత్సరం మే 27, 28 తేదీలలో జరుపుకునే తెలుగువారి పండుగ మహానాడు పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని మందమర్రిలో వర్చువల్ మహానాడు కార్యక్రమానికి వెళ్లడం జరుగుతుందని తెలిపారు

## వైఎస్ఆర్సిపి కార్యకర్త మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన కదిరి ఇంచార్జ్ బిఎస్ మక్బూల్ అహమ్మద్



**తనకల్లు, మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** తనకల్లు మండలం టి సదుం పంచాయతీ బిసినవారి పల్లి గ్రామం వైఎస్ఆర్సిపి కార్యకర్త బాలినేని రమణ అనారోగ్యంతో మృతి చెందడంతో విషయం తెలుసుకున్న తనకల్లు మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ అశోక్ వర్ధన్ రెడ్డి బిసినవారిపల్లి గ్రామానికి వెళ్లి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు వీరితోపాటు తనకల్లు మండలం మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఆనంద్ రెడ్డి నివాళులర్పించి వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.అలాగే వీరితోపాటు ఎంపీటీసీ హిమదర్ రెడ్డి,రెడ్డి పీరా, అబ్దుల్ రసూల్, ముబారక్, అమీర్, రమేష్ నాయక్ , ఆరీఫ్ ,రమణప్ప ,సుధాకర్, నాగరాజు ,జనార్ధన్, హనుమంతు నివాళులు అర్పించారు

## పెగడపల్లి మండల వ్యాప్తంగా ఘనంగా బక్రీద్ వేడుకలు



**పెగడపల్లి, మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రం తో పాటు అన్ని గ్రామాల్లో బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ త్యాగం, ప్రేమ, దయకు ప్రత్యేకమైన పవిత్ర బక్రీద్ పండుగ పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు గురువారం రోజున బక్రీద్ వేడుకలలో భాగంగా గ్రామాల్లోని ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక నమాజ్ లు,ప్రార్థనలు చేసి అలాయి బాలయి చేస్తూఈద్ ఉల్ ఆదా బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రంజాన్ తర్వాత వచ్చే బక్రీద్ త్యాగం, విశ్వాసం దానధర్మాలకు ప్రత్యేకంగా చేసుకుంటామని, బతికేపెల్లి ఫిర్దోస్ మస్జీద్ మొలిసాబ్ మహమ్మద్ మోమిన్, పెగడపల్లి మొలిసాబ్ ముస్లిం పెద్దలు వివరించారు. ఈ కార్యక్రమం లో బి. ఆర్.ఎస్ మైనార్టీ అధ్యక్షులు షేక్ హైదర్ (షేకీల్), మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ జానీ పాషా,సయ్యద్ అన్వర్, మహమ్మద్ రజాక్, సయ్యద్ రషీద్, మహమ్మద్ గాఫుర్, మహమ్మద్ నబి, మహమ్మద్ ఇమాము,సయ్యద్ అబ్జల్, మహమ్మద్ కరీం, మౌలాన, మోసిన్ ఇస్లామోద్దీన్, చంద్ పాషా, షాహాభాజ్, మహమ్మద్ ముస్తఫా, సలీం, మహమ్మద్ బాషుబాయ్, మహమ్మద్ ఓలి పాల్గొన్నారు..

## విడియా కాలనీ నాలా సమస్యను పరిష్కరిస్తాం-రవి కుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి(జర్నలిస్ట్ ఫైల్) :** విడియా కాలనీలో ప్రస్తుతం చేపడుతున్న నాలా పనుల వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతా యని, కాబట్టి వాటిని నిలిపివేసి ఎప్పటి నుంచో ఉన్న పాత నాలాను పెద్దదిగా మార్చి పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ సమస్యను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ దృష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. నాలా సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి, వారితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను సేకరించిన అనంతరం, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాలనీ వాసులు సమ్మెట ప్రసాద్, ఎం.వి. రావు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర రావు, సత్యనారాయణ, నరసింగరావు, రెడ్డి, శ్యాం రావు తదితరులు పాల్గొన్నారు.

## ది స్కౌట్స్ అండ్ గైడ్స్ జగిత్యాల జిల్లా కమిషనర్‌గా పేరం మహేందర్ నియామకం



**జగిత్యాల , మే 29 (జర్నలిస్ట్ ఫైల్) :** ది స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్ జగిత్యాల జిల్లా కమిషనర్‌గా మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామన్‌పల్లి గ్రామానికి చెందిన పేరం మహేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ కమిషనర్ ఆఫ్ ఇండియా సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకానికి సంబంధించిన వివరాలను రాష్ట్ర కమిషనర్ అశోక్ రాజ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లాలో ది స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజేషన్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాభావం పెంపొందించేందుకు పేరం మహేందర్ సమర్థవంతంగా పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేరం మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జాతీయ, రాష్ట్ర కమిటీలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తూ విద్యార్థుల్లో సేవా దృక్పథం, క్రమశిక్షణ, దేశభక్తి భావాలను పెంపొందించేందుకు అంకితభావంతో పని చేస్తానని పేర్కొన్నారు. పేరం మహేందర్ నియామకంపై పలువురు విద్యావేత్తలు, సామాజికవేత్తలు, యువజన సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు

## ప్రమోషన్ పొందిన పోలీసు అధికారులకు ఎస్పీ శుభాకాంక్షలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా ఐజిపి సర్వ శ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వుల మేరకు ప్రమోషన్ పొందిన 2009 బ్యాచ్‌కు చెందిన సీఐలు గురువారం గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రమోషన్ పొందిన అధికారులను అభినందిస్తూ, విధి నిర్వహణలో మరింత నిబద్ధత, క్రమశిక్షణతో ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. పోలీస్ శాఖ ప్రతిష్ఠను పెంచే విధంగా పనిచేయాలని ఆకాంక్షించారు. అలాగే ఎస్‌బి డీఎస్పీ అలహరి శ్రీనివాస్ కూడా అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి, తమ అనుభవంతో శాఖకు మరింత సేవలందించాలని సూచించారు. ప్రమోషన్ పొందిన అధికారులు తమపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## సోమవారం నాటికి 70 శాతం ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి



○ **కమిషనర్ మయూర్ అశోక్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ప్రతి బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) సోమవారం నాటికి కనీసం 70 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై ఎన్నికల విభాగం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని 95 గుంటూరు తూర్పు ఈఆర్ఓ మరియు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ హెచ్చరించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బిఎల్ఓలతో ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఓల వారీగా ఆయా బూత్‌లలో నిర్వహించిన మ్యాపింగ్ పురోగతిని పరిశీలించిన కమిషనర్, పలుచోట్ల మ్యాపింగ్ శాతం తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి బిఎల్ఓ నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ఎన్నికల విభాగాలు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. బిఎల్ఓలు డోర్ టు డోర్ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారంలను ఓటర్లకు అందజేయాల్సి ఉంటుందని, కాబట్టి ఎటువంటి తప్పులు లేకుండా ఎన్నికల నిబంధనల ప్రకారం సరైన మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకంగా ఓటర్ల కుటుంబ వివరాలు, తల్లిదండ్రుల (ప్రోజెనీ) సమాచారం సక్రమంగా నమోదు చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఎవరూ రాంగ్ మ్యాపింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.
ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఈఆర్ఓ మరియు అదనపు కమిషనర్ సాంబశివరావు, ఏఈఆర్ఓ మరియు డిప్యూటీ కమిషనర్ సి. హెచ్. శ్రీనివాస్, ఎన్నికల విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల బాలికలకు అవగాహన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** విద్య ప్రముఖ్యత కేరీర్ మార్గదర్శకత్వం గురించి ఐసీడీఎస్ కాకుమాను మండలం పాంద్రపాడు సెక్టార్ పరిధిలో వల్లూరు గ్రామంలో నిర్వహించారు.
ఈ కార్యక్రమం లో సెక్టార్ సూపర్ వైజర్ ప్రేమలత పాల్గొని మాట్లాడుతూ కిశోర వికాసం సమ్మర్ 2026 లో భాగంగా విద్య ప్రముఖ్యత కేరీర్ మార్గదర్శకత్వం మరియు నైపుణ్యాల అభివృద్ధి వంటి పలు అంశాల గురించి కిశోర బాలబాలికలకు అవగాహన కల్పించారు.
కిశోరిలకు విద్యతో కూడిన క్రమశిక్షణ కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ఒక నైపుణ్యం ఉంటుందని దానిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ ప్రేమలత, ఎం ఎస్ కె శిరీష, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ సొంత నిధులతో టిఫిన్ బండ్లు, తోపుడు బండి పంపిణీ



**మంగళగిరి,(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి పట్టణంలోని చిరువ్యాపారులకు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అండగా నిలిచి ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ తెలిపారు. శుక్రవారం మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరికి చెందిన పలువురు చిరు వ్యాపారులకు టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. 27వ వార్డుకు చెందిన బూదాటి శ్రీనివాసరావు, 19వ వార్డుకు చెందిన పట్టెం నాగమణి, 28వ వార్డుకు చెందిన దేవి లక్ష్మిలకు టిఫిన్ బండ్లు అందజేయగా, 30వ వార్డుకు చెందిన షేక్ బాజికి తోపుడు బండి పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఉపాధి మార్గాలు కల్పిస్తూ స్వయం ఉపాధి వైపు నడిపించడంలో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ కొనియాడారు.
మంత్రి నారా లోకేష్ అందిస్తున్న సహాయం వల్ల అనేక కుటుంబాలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నాయని చెప్పారు. మంగళగిరి అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని పడవల మహేష్ అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు మంత్రి నారా లోకేష్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, భైరబోయిన శివశంకర్, జంజనం వెంకట సుబ్బారావు, తిరువీధుల సతీష్, తోట కరుణ కుమార్, బూదాటి శ్రీనివాసరావు, దామర్ల బిక్షారావు, తాటిచర్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రాజకీయ ప్రాతినిధ్యానికి చారిత్రాత్మక అడుగు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

○ **"33 శాతం కాదు... 50 శాతం మహిళా ప్రాతినిధ్యం వచ్చేలా మన పనితీరు ఉండాలి" - ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ మహానాడులో ప్రకటించిన చారిత్రాత్మక నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం (శ్రీనివాసరావుపేట)లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని మహిళలతో కలిసి "థ్యాంక్యూ సీఎం సార్", "థ్యాంక్యూ లోకేష్ అన్న" అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష, ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తిరువళ్ళూరు పద్మావతి, గౌడ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శైలజ, మహిళా నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం తొలి అడుగు ఎప్పుడూ తెలుగుదేశం పార్టీదేనని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు మహిళల విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన, రాజకీయ ప్రాతినిధ్యం వంటి ప్రతి అంశంలో మహిళల అభివృద్ధినే టీడీపీ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. "ఏ సమాజంలో మహిళ గౌరవించబడుతుందో ఆ సమాజమే పురోగతి సాధిస్తుంది అనే ఉపనిషత్తు వాక్యాన్ని చంద్రబాబు నాయుడు పాలనలో ఆచరణలో పెట్టారు" అని పేర్కొన్నారు.
స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడు గారిదేనని, ఇప్పుడు శాసనసభ స్థాయిలో 33 శాతం రిజర్వేషన్ ప్రకటించడం మహిళల రాజకీయ సాధికారతకు సువర్ణావకాశమని అన్నారు. "175 నియోజకవర్గాల్లో 57 మంది మహిళా ఎమ్మెల్యేలు రావడం చారిత్రాత్మకం. ఇది కేవలం రిజర్వేషన్ కాదు... మహిళా శక్తికి ఇచ్చిన గౌరవం" అని పేర్కొన్నారు.
మహిళలకు అవకాశం రావడం మాత్రమే కాకుండా, ఆ అవకాశాన్ని నిలబెట్టుకునే అర్హత కూడా మహిళలు సాధించుకోవాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.
"సమస్యలు చెప్పేవాళ్లు నాయకులు కాదు... సమస్యలకు పరిష్కారాలు చూపేవాళ్లే నాయకులు. ప్రతి మహిళ తనను తాను నాయకురాలిగా మలుచుకోవాలి" అని సూచించారు. "33 శాతం కాదు... భవిష్యత్తులో 50 శాతం మహిళా ప్రాతినిధ్యం ఇవ్వాల్సిందే అని పార్టీ అధిష్టానం భావించేలా మన పనితీరు ఉండాలి" అని మహిళలకు పిలుపునిచ్చారు.
రాజకీయాల్లో మహిళల పట్ల గౌరవభావం పెరగాలని, మహిళలను కించపరిచే సంస్కృతి మారాలని నారా లోకేష్ నిరంతరం చెబుతున్నారని, మహిళల ఆలోచనా విధానాన్ని మార్చే నాయకత్వం లోకేష్ దని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశంసించారు. మహిళల రాజకీయ భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యం త్వరగా సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
అలాగే ఇటీవల నిర్వహించిన మహానాడు కార్యక్రమాన్ని క్లస్టర్ విధానంలో విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, క్లస్టర్ ఇంచార్జ్‌లకు గళ్ళా మాధవి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహిళలు ఎదిగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని నమ్మే ప్రతి అన్నతమ్ముడు మహిళలకు అండగా నిలవాలని కోరారు.

**జూన్ -2 మెగా జాబ్ మేళా**

జూన్ 2వ తేదీన గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని హిందూ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్ మేళాలో ఐటీ, నాన్-ఐటీ రంగాలకు చెందిన 30 ప్రముఖ కంపెనీలు పాల్గొని సుమారు 1100 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ మహిళలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్ ప్రకటించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. మహిళలు అబలలు కాదని, అన్ని రంగాల్లో ముందుండగల శక్తి మహిళలదేనని అన్నారు. ఎన్టీఆర్ మహిళలకు గౌరవ స్థానం కల్పించగా, చంద్రబాబు నాయుడు మహిళా సాధికారతకు బాటలు వేశారని, ఇప్పుడు నారా లోకేష్ మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని కొనియాడారు.
తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే పార్టీకి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లని, మహిళలకు ఆత్మవిశ్వాసం, యువతకు ఉద్యోగాలు, ప్రతి ఇంటికి అభివృద్ధి అందించడమే టీడీపీ లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వంలో యువతను నిరుద్యోగులుగా మార్చారని విమర్శిస్తూ, కూటమి ప్రభుత్వం ఉద్యోగ కల్పనలో వేగంగా ముందుకెళ్తోందన్నారు. ఇప్పటికే లక్షలాది ఉద్యోగాలు కల్పించామని, మెగా డీఎస్సీ, పోలీస్ నియామకాలు పారదర్శకంగా నిర్వహించామని వివరించారు.
రానున్న ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ ద్వారా మహిళలు పెద్ద ఎత్తున నాయకత్వంలోకి రావడం ఖాయమని, ఇది ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచే నిర్ణయమని అన్నారు. చివరగా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీకి మహిళల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా ఫిర్యాదులు పరిష్కారం పై దృష్టి సారించాలి

○ **ప్రజాదర్బార్‌లో ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు ఆదేశం**



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా సమస్యలను నిర్ణీత గడువులోగా వెంటనే పరిష్కరించాలని, ప్రజా దర్బార్ వేదికగా ప్రజలు సమర్పించిన ప్రతి ఒక్క అర్జీని పూర్తి చేసి ఆ విషయాన్ని వారికి తెలియజేయాలని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ సీనియర్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అధికారులను ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రజల నుండి గ్రామాల్లో పింఛన్లు, సైడ్ డ్రైన్లు, సిసి రోడ్లు, భూసమస్యలు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి మొత్తం 35 అర్జీలు వచ్చాయి. ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించిన జీవి ఆంజనేయులు, దర్బార్ వేదిక నుండే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సుపరిపాలన, సమన్యాయం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందుతున్నామని ఆయన వివరించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా పారదర్శక సేవలు అందించడమే ధ్యేయమని, ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పెద్ద సంఖ్యలో సేవలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలు ఇంటి వద్ద నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆలోచనల ప్రకారం సేవలలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిత్యం వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినప్పుడే పాలనా యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని జీవి ఆంజనేయులు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో చెరువులకు మహర్దశ



○ **జలాధార కార్యక్రమంలో భాగంగా వాంపల్లె చెరువు మరమ్మత్తు పనులు ప్రారంభం**

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ )** బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని వాంపల్లె గ్రామంలో జలాధార కార్యక్రమంలో భాగంగా 10 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న చెరువు మరమ్మత్తు పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల అభివృద్ధి రైతులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో భూగర్భ జలాలు అభివృద్ధి చెందడమే కాకుండా రైతులకు సాగునీటి సమస్య కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న జలాధార కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. వాంపల్లె చెరువు మరమ్మత్తు పనులు పూర్తయితే డి. అగ్రహారం, టి. రామాపురం, వాంపల్లెచెరువు గ్రామాలలోని రైతులకు, పశువులకు నీటి అవసరాలు తీరడంతో పాటు వ్యవసాయానికి మేలు జరుగుతుందని, వాంపల్లెచెరువు మరమ్మత్తు పనుల కోసం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళిన టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి కి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ నవీన్, ఇరిగేషన్ సిబ్బంది మరియు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు, పాల్గొన్నారు.

# నీటి గుంటలు, ఊబి ప్రదేశాల వద్ద అప్రమత్తంగా ఉండాలి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** నీటి గుంటలు, ఊబి ప్రదేశాల వద్ద ప్రజలు ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి. యం. సాయి కాంత్ వర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, యువత ఆట పాటలపై దృష్టి సారిస్తారని అన్నారు. ఇందులో భాగంగా ఈత వంటి కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనే అవకాశాలు ఉంటాయని చెప్పారు. గ్రామ చెరువులు, దగ్గరలో ఉన్న సరస్సులు, వాగులు, వంకలుతో సహా క్వారీ తవ్వకాలు చేపట్టిన తరువాత నీటి గుంటలుగా ఏర్పడతాయని అటువంటి ప్రదేశాల్లో లోతు ఎక్కువగా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. క్వారీ గుంటల వద్ద నీటిలో దిగుటకు అనువుగా ఉండదని, లోతైన ప్రాంతాలుగా ఉండే అవకాశాలు ఉంటాయని ఇటువంటి ప్రదేశాల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన తీసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, సెలవులు కావడంతో పిల్లల ఆటపాటపై మనస్సు లగ్నం చేస్తారని వారి కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. లోతైన, తెలియని నీటి నిల్వ ప్రదేశాలు దిశగా వెళ్లకుండా ఒక కంట కనిపెట్టాలని అన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటం వలన ఈతకు వెళ్ళుటకు ఎక్కువ ఆసక్తి చూపించే అవకాశం ఉందని చెప్పారు. పశువులను స్నానాలకు కూడా తీసుకువెళ్లడం, నీరు తాగించుటకు తీసుకువెళ్ళడం జరుగుతుందని తెలిపారు. చెరువులు, నీటి గుంటలు, కాలువలు ఇతర నీటి నిలువ ప్రదేశాలు, ఊబి ఉండే ప్రదేశాలను గుర్తించి వాటి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అటు ప్రక్కగా ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ, రెవెన్యూ శాఖలను ఆదేశించారు.
అనుమతి లేని క్వారీలు పైనా దృష్టి సారించాలని ఆదేశించారు. ఎటువంటి దుర్ఘటన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్వారీలకు అనుమతులు మంజూరు చేసినప్పుడే వాటి నిర్వహణ పట్ల స్పష్టమైన నిబంధనలు జారీ చేయాలని గనుల శాఖను ఆదేశించారు. రహదారి ప్రక్కన లేదా జనం సమూహ ప్రాంతాల్లో మరిన్ని మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటువంటి తెలియని నీటి నిల్వ ప్రదేశాలు, లోతైన, ప్రమాదకరమైన ప్రదేశాల సమాచారం ఉంటే స్థానిక గ్రామ పంచాయతీ, రెవెన్యూ, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

**అకాల వర్షాలు, గాలుల సమయంలో హోర్డింగ్స్, చెట్లు క్రింద ఉండరాదు**

అకాల వర్షాలు, గాలుల సమయంలో హోర్డింగ్స్, చెట్లు క్రింద ఉండరాదని జిల్లా కలెక్టర్ ప్రజలను కోరారు. పిడుగుపాటు వంటి సమయంలో చెట్లు క్రింద ఉండటం మరింత ప్రమాదకరమని, విద్యుదాఘాతం సంభవించవచ్చని అన్నారు.

## గుంటూరులో "ఆపరేషన్ క్లీన్ స్వీప్" ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 'స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్ర' సాధనలో భాగంగా గుంటూరు నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" పేరుతో నాలుగు వారాల ప్రత్యేక పారిశుధ్య కార్యాచరణను చేపట్టినట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరాలు వెల్లడించారు.
ఈనెల 30వ తేదీ నుండి జూన్ 4వ తేదీ వరకు నగరంలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం ఐపిడి కాలనీ, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ప్రాంతంలో విస్తృత స్థాయిలో శుభ్రత చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. స్ట్రామ్ వాటర్ డ్రైన్లను జేసీబీలు, నాలా మెషిన్లు, రోబో మెషిన్ల సహాయంతో శుభ్రపరిచే పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. సుమారు 100 మంది పారిశుధ్య కార్మికులు పాల్గొని ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నారని చెప్పారు.
ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత పరిరక్షణతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వలను నివారించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలందరూ సహకరించి "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ కోరారు.

# కిశోర బాలబాలికలు జాగ్రత్తలు పాటించాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** విద్య ప్రముఖ్యత కేరీర్ మార్గదర్శకత్వం గురించి ఐసీడీఎస్ కాకుమాను మండలం కాకుమాను సెక్టార్ పరిధిలో కాకుమాను గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సెక్టార్ సూపర్ వైజర్ వెంకాయమ్మ పాల్గొని మాట్లాడుతూ కిశోర వికాసం సమ్మర్ 2026 లో భాగంగా విద్య ప్రముఖ్యత కేరీర్ మార్గదర్శకత్వం మరియు నైపుణ్యాల అభివృద్ధి వంటి పలు అంశాల గురించి కిశోర బాలబాలికలకు అవగాహన కల్పించారు. కిశోరిలకు విద్యతో కూడిన క్రమశిక్షణ కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిలోనూ ఒక నైపుణ్యం ఉంటుందని దానిని గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో సూపర్ వైజర్ వెంకాయమ్మ, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి : లేళ్ళ అప్పిరెడ్డి




**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్):** మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులోని లాడ్జి సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు, యువజనులు ధర్నా నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వైసీపీ నాయకులు పాల్గొని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, మెగా డీఎస్సీ నిర్వహణలో భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. మెరిట్ లిస్టులను దాచడం, టాపర్ల వివరాలను తొలగించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. డీఎస్సీ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ, 16 వేల పోస్టుల భర్తీలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, "మెగా డీఎస్సీ కాస్త దగా డీఎస్సీగా మారింది" అని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య మాట్లాడుతూ, డీఎస్సీ నిర్వహణలో పేపర్ లీకులు, డేటా డిలీట్, మెరిట్ లిస్టు మాయం వంటి అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. నారా లోకేష్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే విద్యార్థి సమస్యలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## షోలింగర్ యోగ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి లోకేష్



**షోలింగర్ (జర్నలిస్ట్ ఫైల్) :** తమిళనాడు రాష్ట్రం రాణిపేట జిల్లా షోలింగర్ పట్టణంలోని ప్రసిద్ధ అమృతవల్లి తాయారు యోగ నరసింహస్వామి వారిని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ దర్శించుకున్నారు. ఈ ఉదయం షోలింగర్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.

అనంతరం రోప్ వే మార్గంలో కొండపై ఉన్న ఆలయానికి చేరుకుని యోగ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు మంత్రికి వేదాశీర్వచనం చేసి శాలువాతో సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం యోగ నరసింహస్వామి ఆలయం సమీపంలోనే మరో కొండపై కొలువై ఉన్న శ్రీ యోగ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని మంత్రి సందర్శించారు. కాలినడకన 420 మెట్లు ఎక్కి యోగ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరిగివస్తూ మార్గమధ్యలో భక్తులను మంత్రి లోకేష్ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, డాక్టర్ కే. మురళీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎమ్ఈగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎ. విష్ణు వర్ధన్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర వైద్య విద్యా శాఖ నూతన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా డా. ఎ. విష్ణు వర్ధన్ శుక్రవారం అధికారికంగా పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గల డీఎమ్ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

డాక్టర్ ఎ. విష్ణు వర్ధన్ ఎం.డి (అనస్థీషియాలజీ) పూర్తి చేసి వైద్య విద్యా రంగంలో విశేష అనుభవం సంపాదించారు. ప్రస్తుతం కాకినాడలోని రంగరాయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తూ, విద్యార్థుల విద్యాభివృద్ధి, వైద్య సేవల మెరుగుదల కోసం అనేక విధాలుగా కృషి చేశారు. డీఎంఈగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వైద్య విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నాణ్యమైన వైద్య విద్య, ఆధునిక సౌకర్యాల కల్పన, అధ్యాపకులు, విద్యార్థుల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ప్రభుత్వ బోధనా ఆసుపత్రులలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. అలాగే ఆసుపత్రులలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

అభినందించిన వారిలో ఇశా అధ్యక్షులు డాక్టర్ చక్రరావు, యూనివర్సిటీ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ సురేష్, ఎస్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వై. రావు, మనోవైద్య నిపుణులు డాక్టర్ కృష్ణమోహన్, డాక్టర్ ఠాగూర్, డాక్టర్ కర్నాటి శరత్‌తో పాటు పలువురు వైద్యులు, అధ్యాపకులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## టిడిపి సంక్షేమ నిధికి పెమ్మసాని రూ.కోటి విరాళం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న కార్యకర్తల సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రూ. 1 కోటి విరాళాన్ని అందజేశారు.

మహానాడు రెండో రోజు కార్యక్రమం సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి మరియు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి ఈ విరాళ చెక్కును అందించారు.

పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీకి ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించే సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని తెలిపారు.

పార్టీ బలోపేతానికి, కార్యకర్తల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.

## అడిషనల్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్‌కు ఘన వీడ్కోలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టరేట్‌లో అడిషనల్ డైరెక్టర్ (ఏడీ)గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేస్తున్న పి. కిరణ్ కుమార్‌ను సీఆర్ మీడియా అకాడమీ తరఫున మేనేజర్ ఎం. భాస్కర్ నారాయణ, సిబ్బంది శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

డైరెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పి. కిరణ్ కుమార్ సమాచార శాఖలో పలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. మీడియా, ప్రజా సంబంధాల రంగంలో ఆయన అనుభవం, సేవా దృక్పథం యువ అధికారులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో సీఆర్ మీడియా అకాడమీ జూనియర్ అసిస్టెంట్ లవరాజు, పీఎస్ శ్రీనివాస జీవన్, సిబ్బంది ఆదిత్య, జె. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థ ఏర్పాటు చేయండి

- ఫైబర్ ఉత్పత్తి అయ్యే ఉద్యాన పంటలతో రైతులకు అదనపు ఆదాయాలు
- ఏపీలో కొబ్బరితో సహా వేర్వేరు పంటల ద్వారా పీచు ఉత్పత్తికి ఆస్కారం
- కేంద్ర జౌళి శాఖ మంత్రికి సీఎం ప్రతిపాదనలు
- సచివాలయంలో సీఎం చంద్రబాబుతో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ భేటీ





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లో వేర్వేరు ఉద్యాన పంటల ద్వారా ఉత్పత్తి అవుతున్న ఫైబర్ కు ప్రోత్సహం కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి స్పష్టం చేశారు. ఈ మేరకు సచివాలయంలో శుక్రవారం తనను కలిసిన కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తో సీఎం ఈ ప్రతిపాదనలు సమర్పించారు. రాయలసీమ సహా కోస్తాంధ్ర ప్రాంతాల్లో సాగు చేస్తున్న వివిధ పంటల ద్వారా పీచు, నార, ఫైబర్ ఉత్పత్తి అవుతుందని, దీనిని వాణిజ్య స్థాయిలో విలువ జోడించేందుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సీఎం కోరారు. పీచు వెలికితీతతో పాటు వస్త్ర పరిశ్రమకు ఉపయోగపడే ఉద్యానవన పంటల నివేదికను సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి సమర్పించారు. కడప, అనంతపురం, నంద్యాల, పశ్చిమ గోదావరి, కృష్ణా, తూర్పు గోదావరి లాంటి అరటి పండించే జిల్లాలలో పోస్ట్-హార్వెస్ట్ విలువ ఆధారిత ప్రక్రియగా అరటి కాండం పీచు వెలికితీత కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యాన శాఖ సమన్వయంతో స్వయం సహాయక సంఘాల కోసం క్లస్టర్ ఆధారిత మెకానికల్ డెకోర్టికేటర్ యూనిట్లను ప్రోత్సహించేలా సహకారం అందించాలని సీఎం కోరారు. ప్రస్తుతం ఏపీలో 1,29,931 హెక్టార్లలో అరటి సాగవుతోందనీ. పంట కోత తర్వాత కాండం పూర్తిగా వృథాగా పోకుండా. సెల్యులోజిక్ పీచు ద్వారా పర్యావరణ అనుకూల ఫైబర్ తయారు అవుతుందని వివరించారు. వస్త్ర పరిశ్రమలో జనపనారతో సమానంగా ఇది ఉపకరిస్తుందని తెలిపారు. హస్తకళలు, జియో టెక్స్‌టైల్స్, ప్రత్యేక పేపర్, ఎగుమతి రకం దుస్తుల తయారీకి వనరుల లభ్యత ఉందని వివరించారు. వస్త్ర పరిశ్రమతో పీపీపీ భాగస్వామ్యాల ద్వారా వెదురుకు సంబంధించిన మెకానికల్ ఫైబర్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. తద్వారా గిరిజన, మెట్ట ప్రాంత రైతులకు 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం లభిస్తుందనీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పోక చెక్క ఆకుల ద్వారా లీఫ్ షీట్స్ తయారీకి అనుబంధ పరిశ్రమలకు అవకాశం ఉందని సీఎం వివరించారు. చాపలు, జియో టెక్స్‌టైల్ రోల్స్, కాంపోజిట్ బోర్డుల తయారీకి అనుకూలంగా ఉంటుందని.. స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా వీటి తయారీకి ఆస్కారం ఉందని తెలిపారు. శ్రీ సత్యసాయి, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, అల్లూరి జిల్లాల్లో ఎక్కువగా లభించే ఈ వనరు వల్ల పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్, ఫ్లోర్ మ్యాట్స్ వంటి కుటీర, చిన్న తరహా పరిశ్రమలకు ఊతం లభిస్తుందనీ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంత జిల్లాల్లో కొబ్బరి పీచు పరిశ్రమను బలోపేతం చేసేలా ప్రస్తుత కాయిర్ బోర్డ్ డ్వాక్రా నెట్‌వర్క్ ద్వారా మెకనైజ్డ్ హస్క్ ప్రాసెసింగ్ యూనిట్లు, కాయిర్ జియో టెక్స్‌టైల్స్ పరిశ్రమల స్థాపనకు జౌళి శాఖ సహకారం కావాలని సీఎం పేర్కొన్నారు. 1,16,367 హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందనీ రాజమహేంద్రవరంలో కాయిర్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాలు, శిక్షణ కేంద్రాలుప అందుబాటులో ఉన్నాయనీ.. కొబ్బరి పీచుకు ఉప్పు నీరు, బూజు కీటకాలను తట్టుకునే సహజ గుణం ఉండటం వల్ల తీరప్రాంత జియోటెక్నికల్ అప్లికేషన్లలో దీనికి ఎంతో డిమాండ్ ఉందనీ సీఎం వివరించారు. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతంతో పాటు కృష్ణా-గోదావరి డెల్టా పరిధిలో గట్లు బలోపేతానికి, నేల కోత నివారణకు ఈ కాయిర్ జియో టెక్స్‌టైల్స్ ఎంతో కీలకం అవుతాయని సీఎం తెలిపారు. ముడి పీచు ఎగుమతి కంటే జియో-రోల్స్, నీడిల్-ఫెల్ట్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల ద్వారా 3 నుండి 4 రెట్లు ఎక్కువ ధర లభిస్తుందనీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**కుప్పం లో పీఎం మిత్రా పార్కు అమరావతిలో నిఫ్ట్ ఏర్పాటుకు సహకారం:** ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వస్త్ర పరిశ్రమ క్లస్టర్లకు సమీపంలో ఉన్న కుప్పంలో పీఎం మిత్రా పార్కును ఏర్పాటు చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. 35 వేల పవర్ లూమ్ లు, 100కు పైగా స్పిన్నింగ్ మిల్లులు ఉన్నాయని తెలిపారు. ఫైబర్ టు ఫ్యాషన్ కు అనుకూలించేలా ఈ పీఎం మిత్రా పార్కు 2.0 ఏర్పాటు చేయాలని కోరారు. అమరావతిలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. దీనికి అవసరమైన రూ. 280 కోట్ల నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. నిఫ్ట్ కోసం అమరావతిలో 10 ఎకరాల భూమిని కేటాయించినట్టు వివరించారు. అలాగే ఏపీలోని వివిధ వస్త్ర పరిశ్రమ క్లస్టర్లలో ఇంటిగ్రేటెడ్ వెట్ ప్రాసెసింగ్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పార్కుల ద్వారా ఎండ్ టూ ఎండ్ ప్రాసెసింగ్ పెరిగి రవాణా ఖర్చులు తగ్గుతాయని వివరించారు. నేషనల్ న్యూ ఏజ్ ఫైబర్ మిషన్ కింద ఏపీని ప్రాధాన్యతా రాష్ట్రంగా గుర్తించాలని కోరారు. తద్వారా అరటి పీచు లాంటి ఫైబర్ కు విలువ జోడించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. వివిధ చేనేత క్లస్టర్లలో అరటి ఫైబర్ తో బ్లెండ్ చేసిన నూలు వినియోగించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కింద మంగళగిరి లో 22.36 కోట్ల తో చేనేత పార్కు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు. అలాగే అమరావతిలో చేనేత హస్త కళల మ్యూజియం ఏర్పాటుకు సహకారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ జౌళి మంత్రిత్వ శాఖ తరపున ఏపీకి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.

# నున్నలో పేద విద్యార్థుల కోసం ఆశాదీపం

- భారీ హాస్టల్ భవన నిర్మాణానికి ముమ్మర సన్నాహాలు
- అనుమతుల కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తా
- ఎంపీ సానా సతీష్ బాబు హామీ
- పేద విద్యార్థుల కష్టాలను గమనించాం.. నాణ్యమైన వసతి కల్పనలో వెనక్కి తగ్గేదే లేదు: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ
- విద్యార్థుల వసతి సమస్యలకు చెక్: రాయల్ సర్వీస్ ట్రస్ట్ సేవలపై వెల్లువెత్తిన ప్రశంసలు



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ ప్రాంతాల నుంచి విజయవాడ వంటి నగరాలకు ఉన్నత చదువుల కోసం వచ్చే పేద, మధ్యతరగతి విద్యార్థుల వసతి సమస్యలను తీర్చేందుకు 'రాయల్ సర్వీస్ ట్రస్ట్' ఒక బృహత్తర ప్రాజెక్టును చేపట్టింది. ఎన్టీఆర్ జిల్లా నున్న గ్రామ పరిధిలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ప్రతిష్టాత్మక హాస్టల్ భవనాన్ని నిర్మించేందుకు ఈ ట్రస్ట్ నడుం బిగించింది. ఈ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని కోరుతూ, ట్రస్ట్ ప్రతినిధులు రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కీలక ప్రతిపాదన వెనుక మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ మార్గదర్శకత్వం ఎంతో ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వంగవీటి రాధాకృష్ణ మాట్లాడుతూ, "చదువుకోవాలనే తపన ఉన్నా, వసతి లేక ఎంతోమంది ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. వారిని ప్రోత్సహించడం కోసం అన్ని రకాల భద్రతా ప్రమాణాలతో కూడిన వసతిని కల్పిస్తూ ఈ హాస్టల్‌ను నిర్మిస్తున్నాం. ప్రభుత్వం నుంచి వచ్చే అనుమతులు సకాలంలో అందేలా ఎంపీ కి విన్నవించాము. ట్రస్ట్ ప్రతినిధుల విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించిన ఎంపీ సానా సతీష్ బాబు, విద్యా రంగంలో ట్రస్ట్ చేస్తున్న ఈ కృషిని అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని, హాస్టల్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత శాఖలకు సిఫార్సు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల కోసం ఇంతటి గొప్ప సేవా కార్యక్రమాన్ని చేపట్టిన రాయల్ సర్వీస్ ట్రస్ట్ సభ్యులను ఆయన ప్రశంసించారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ, "గ్రామీణ విద్యార్థులకు కేవలం వసతి మాత్రమే కాకుండా, నాణ్యమైన భోజనం, చదువుకోవడానికి ప్రశాంతమైన వాతావరణం, భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించాం. దీనివల్ల వందలాది మంది పేద విద్యార్థులకు భరోసా కలుగుతుంది," అని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెటేటి పుల్లయ్య, సీతాళం రాంబాబు, పెడన మాజీ ఎమ్మెల్యే బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే ఈ హాస్టల్ నిర్మాణం కార్యరూపం దాల్చి, విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రాయల్ సర్వీస్ ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. విద్యాభివృద్ధికి ఈ హాస్టల్ ఒక ఆశాదీపంగా మారుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అబోహర్‌లో బీజేపీ విజయకేతనం.. తొలిసారి మేయర్ పదవి కైవసం



**ఛండీగఢ్ (జర్నలిస్ట్ ఫైల్) :** పంజాబ్ లోని అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించింది. 50 వార్డుల్లో 28 వార్డులు సొంతం చేసుకుంది. దీంతో అబోహర్‌లో బీజేపీ తొలిసారి మేయర్ పదవిని చేపట్టేందుకు మార్గం సుగమమైంది. 2027లో కీలకమైన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండటంతో ఈ గెలుపు బీజేపీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

అబోహర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలను శుక్రవారంనాడు ప్రకటించారు. బీజేపీ 28 వార్డులు గెలుచుకోగా, ఆప్ 20 వార్డులతో రెండో స్థానంలో నిలిచింది. కాంగ్రెస్ ఒక స్థానం, ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక స్థానం గెలుచుకున్నారు.

'కాలిఫోర్నియా ఆఫ్ పంజాబ్'గా అబోహర్‌ను పిలుస్తారు. కిన్నో పండ్ల సాగు, బలమైన వ్యవసాయ ఆదాయం కలిగిన ప్రాంతమిది. ఆర్థికంగా, రాజకీయంగా పలుకుబడి కలిగిన అర్బన్ సెంటర్లలో ఇదొకటి. ఈ ప్రాంతంలో ఓటర్ల మనోభావాలను తాజా ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని, 2027 ఎన్నికలకు ముందు ఇలాంటి ఫలితం వెలువడంతో ఆసక్తికరమని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రంలోని 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపల్ కౌన్సిళ్లు, 20 నగర పంచాయతీలకు మే 26న ఎన్నికలు జరిగాయి.

మోహాలి, బటిండా, అబోహర్, బర్నాలా, కపుర్తాలా, మోగా, బటాలా, పఠాన్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల్లో 7.555 మంది పోటీ చేశారు. ఆప్, కాంగ్రెస్, బీజేపీ, సాద్‌తో పాటు బహుజన్ సమాజ్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

# రవీంద్రభారతి తరహాలో ... గుంటూరుకు నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో దాదాపు 26 సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిపోయిన నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం పునర్నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1999లో గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు, అన్నమయ్య సేవా సమితి ఆధ్వర్యంలో పీపీపీ /పీ4 విధానంలో పూర్తి కానుంది. గుంటూరుకు సాంస్కృతిక, సాహిత్య, కళారంగాలకు కేంద్రబిందువుగా నిలిచేలా ఈ ఆడిటోరియాన్ని అభివృద్ధి చేయనున్నారు.

ప్రాజెక్టు పూర్తయిన తర్వాత గుంటూరు నగరానికి ఒక ప్రముఖ సాంస్కృతిక వేదిక అందుబాటులోకి రానుండగా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు కనీస హామీ ఆదాయం, రెవెన్యూ షేరింగ్, లైసెన్స్ ఫీజుల రూపంలో ఆదాయం సమకూరనుంది. ఈ పునర్నిర్మాణ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి & కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొని పలు ముఖ్య వ్యాఖ్యలు చేశారు.

దాదాపు 26 సంవత్సరాలుగా పూర్తి కాకుండా ఉన్న నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం ప్రాజెక్టు నేడు కార్యరూపం దాల్చడం గుంటూరు నగరానికి శుభపరిణామమని పెమ్మసాని పేర్కొన్నారు. 1999లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టు పూర్తి దిశగా అడుగులు వేయడం ఆనందదాయకమన్నారు. ఆ రోజుల్లో మాజీ మేయర్ కొల్లి శారద అందించిన విరాళం, చూపిన చొరవ ఈ ప్రాజెక్టుకు బలమైన పునాది వేసిందన్నారు. ఎన్నికల అనంతరం ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకువచ్చిన ఎమ్మెల్యే గల్లా మాధవి, గల్లా రామచంద్రరావు నిరంతరం కృషి చేశారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మేయర్ కోవెలమూడి రవీంద్ర, కార్పొరేటర్లు, అధికారులు సమన్వయంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లారని పెమ్మసాని చెప్పారు. ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయి పారదర్శకత, చట్టబద్ధతతో అమలు చేయడానికి టెండర్, ఈఓఐ ప్రక్రియల ద్వారా ముందుకు తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఇది కేవలం పీపీపీ ప్రాజెక్టు మాత్రమే కాదని, ప్రజా శ్రేయస్సు కోసం చేపట్టిన పీ4 స్ఫూర్తితో కూడిన కార్యక్రమమన్నారు.

దాదాపు రూ. 10 కోట్ల నుంచి రూ. 15 కోట్ల వరకు వ్యయం చేసి ప్రజల కోసం ముందుకొచ్చిన అన్నమయ్య సేవా సమితి సేవాభావం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ప్రాజెక్టు అమలుతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌కు మొదటి సంవత్సరం కనీస హామీ ఆదాయంగా రూ. 22.50 లక్షలు లభించనున్నాయని తెలిపారు. వార్షిక స్థూల ఆదాయంలో 14 శాతం అదనపు డెవలప్‌మెంట్ ప్రీమియం రూపంలో జీఎంసీకి ఆదాయం లభిస్తుందని, ప్రతి మూడు సంవత్సరాలకు 5 శాతం ఎస్కలేషన్ అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఇండిపెండెంట్ ఇంజనీర్ పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలతో పనులు చేపడతామని తెలిపారు.

గుంటూరుకు ఎన్నో ఆడిటోరియంలు రావొచ్చని, కానీ నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం నగరానికి సాంస్కృతిక తలమానికంగా నిలవాలని పెమ్మసాని ఆకాంక్షించారు. హైదరాబాద్‌కు రవీంద్రభారతి ఎలాగో, గుంటూరుకు నార్ల వెంకటేశ్వరరావు ఆడిటోరియం అలాంటి గుర్తింపు పొందాలని అన్నారు. కళా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ ఆడిటోరియం ప్రధాన వేదికగా రూపుదిద్దుకోవాలని, సమాజం కోసం జీవించిన నిర్భయ సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు పేరుకు తగిన స్థాయిలో ఈ ఆడిటోరియం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మరో ఏడాది నుంచి ఏడాదిన్నర వ్యవధిలో ఈ ఆడిటోరియం పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ, దాదాపు 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు నేడు కార్యరూపం దాల్చడం సంతోషకరమన్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే నార్ల ఆడిటోరియం పూర్తి చేయడాన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకున్నానని తెలిపారు. కౌన్సిల్‌లో 23 సార్లు ఈ అంశాన్ని ప్రతిపాదించి చర్చించినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాజెక్టుకు కొత్త ఊపు వచ్చిందన్నారు. ఇది కేవలం ఆడిటోరియం మాత్రమే కాదని, గుంటూరు నగరానికి సాంస్కృతిక గుర్తింపుగా నిలవబోతుందని పేర్కొన్నారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతర ఫాలోఅప్, ప్రత్యేక చొరవ ఈ ప్రాజెక్టు పురోగతికి కీలకమైందని తెలిపారు.

ఎమ్మెల్సీ మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గుంటూరుకు మంచి రోజులు వచ్చాయని, 25 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు పూర్తి దిశగా అడుగులు వేయడం ఆనందదాయకమన్నారు. నార్ల వెంకటేశ్వరరావు కేవలం గుంటూరుకే కాకుండా దేశానికి తలమానికమని, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. పత్రికా సంపాదకుడిగా వృత్తి ధర్మానికి కట్టుబడి నిలిచిన అరుదైన వ్యక్తిత్వం నార్లదని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో కళాకారులు ప్రదర్శనలు ఇవ్వాలని కోరుకునే ప్రముఖ సాంస్కృతిక కేంద్రంగా ఈ ఆడిటోరియం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యాలరావు, మాజీ మేయర్ కొవెలమూడి రవీంద్ర(నాని), మాజీ మేయర్ కొల్లి శారద, తాడిశెట్టి మురళీమోహన్, గాదె వెంకటేశ్వరరావు, డేగల ప్రభాకర్, ఈశ్వర్, చుక్కపల్లి రమేష్, జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, మంజులారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ వందనాదేవి, టిడిపి నాయకులు నిమ్మల శేషయ్య, అన్నమయ్య సేవా సమితి అధ్యక్షులు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467